సాక్షి
నారాయణపేట
శనివారం : 8 : ఫిబ్రవరి : 2025



నమో వేంకటేశా..
మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.
వివరాలు 8లో ▸



పెద్దాస్పత్రికి దిక్కెవరు..?
మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో సమస్యలు తాండవం చేస్తున్నాయి.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.3 /15.5

వాతావరణం
చల్లని గాలులు వీయడంతోపాటు మంచు కురుస్తుంది. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది. ఎండ ప్రభావం చూపిస్తుంది.

న్యూస్‌రీల్

క్రీడల్లో రాణించాలి



నారాయణపేట: కరీంనగర్ జిల్లాలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగిన మూడో తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2025 లో భాగంగా నారాయణపేట జిల్లా నుంచి ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ సంధ్య రాణి లాంగ్ జంప్‌లో 4.10 మీటర్లు జంప్ చేసి బ్రౌన్ మెడల్ సాధించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్‌ని శుక్రవారం కార్యాలయంలో ఆమెకు మెడల్ ప్రధానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలలో మహిళలు రాణించాలని, శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం



పాన్‌గల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేక, కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి జబ్బార్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.50.60 లక్షల కోట్ల బడ్జెట్‌లో అన్ని సంక్షేమ పథకాలకు కోత విధించిందని.. పేద, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసే అన్ని వస్తువుల ధరలు, వారు చెల్లించే పన్నులు పెరిగిపోతున్నాయన్నారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 10న ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్‌ను ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహా ధర్నాకు జిల్లా నుంచి పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బాల్యానాయక్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటయ్య, నాయకులు జంబులయ్య, డీవైఎఫ్ఐ నాయకుడు కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరస్వామి జాతరకు ఏర్పాట్లు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతరకు సంబంధించి మార్చి 1, 2, 3 తేదీల్లో రాత్రి 9గంటలకు తేరుమహోత్సవం కనులపండుగగా జరుగనుంది. శుక్రవారం ఆలయ చైర్మన్ వెంకటనర్సింహారావు, వైస్‌చైర్మన్ ఏపూరి యాదగిరిశెట్టి, ప్రధాన కార్యదర్శి సాయిరాఘవ, కోశాధికారి మణివర్ధన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి తెలుగు నాగేష్, కమిషనర్ శశిధర్ ఆధ్వర్యంలో ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ చేపట్టబోయే ఏర్పాట్ల గురించి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. 1560వ సంవత్సరంలో ఆలయంలో లింగాన్ని ప్రతిష్ఠించారని, అప్పటి నుంచి మహాశివరాత్రి సందర్భంగా అమావాస్య అనంతరం జాతరను చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

కంది రైతుపై ఆంక్షల కత్తి

ఎకరానికి 3.31 క్వింటాళ్ల కొనుగోలుకే పరిమితం



నర్వలో ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి (ఫైల్)

- ఆంక్షలతో ప్రైవేటులో విక్రయించి నష్టపోతున్న రైతులు
- మరికొందరు కర్ణాటకు తరలిస్తున్న వైనం
- జిల్లాలో 70 వేల ఎకరాల్లో కంది సాగు.. 6 కొనుగోలు కేంద్రాలు
- దిగుబడి అంచనా 2.65 లక్షల క్వింటాళ్లు

నర్వ: ఆరుగాలం కష్టించి పండించిన కందులను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన రైతన్న పరిస్థితి దయనీయంగా మారింది. కంది పంట ఇంటికి చేరుతున్న తరుణంలో ధర తగ్గడంతో రైతుల నుంచి మద్దతు ధర కంది పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 6 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోళ్లలో నిబంధనలతో రైతులు పంటను విక్రయించుకోలేని పరిస్థితి నెలకొంది. ఒక్కో రైతు నుంచి ఎకరానికి 3.31 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయాలని ఆదేశాలు రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా వ్యవసాయశాఖ నిర్వహించిన సమగ్ర సర్వేలో కందిపంట సాగు చేసినట్లు పేర్లు ఉన్న రైతులు నుంచి మాత్రమే కొనుగోలు చేయాలనే నిబంధన ఉంది. ప్రభుత్వ ఆంక్షలతో కేంద్రాల్లో పంటను విక్రయించుకోలేక జిల్లా రైతులు కర్ణాటక మార్కెట్‌కు కందిని తీసుకెళ్తున్నారు.

తగ్గిన పరిమితి

కంది పంట చేతికి రాగానే క్వింటాల్ రూ.10 వేలు ఉన్న ధర రూ.7వేలకు పడిపోయింది. మద్దతు ధర కంటే మార్కెట్లో ధర తగ్గిపోవడంతో మద్దతు ధరతో కంది కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. గతంలో ఎకరానికి ఆరు క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేసిన ప్రభుత్వం ఈ ఏడాది మరింత తగ్గించింది. రైతులకు వచ్చే పంట దిగుబడితో సంబంధం లేకుండా ఎకరానికి 3.31 క్వింటాళ్లు ఒక్కో రైతు నుంచి 40 క్వింటాళ్లకు మించి కొనుగోలు చేయొద్దని ఆంక్షలు విధించింది. అంతర పంటగా సాగు చేసే రైతులకు నాలుగు క్వింటాళ్లు, పూర్తిగా కంది పంట సాగు చేసే రైతులకు ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. చేసేదేమి లేక రైతులు కర్ణాటకకు పంటను తీసుకెళ్తున్నారు. అక్కడ పంటను విక్రయించుకుంటే డబ్బులు త్వరగా వస్తాయని వెళ్తున్నట్లుగా తెలిసింది.

2.65 లక్షల క్వింటాళ్ల దిగుబడి

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 70 వేల ఎకరాల్లో రైతులు కందిపంటను సాగుచేశారు. ఇందులో ఈ దిగుబడి అంచనా 2లక్షల 65 వేల క్వింటాళ్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వాతావరణం అనుకూలించక దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. దీనికి తోడు పంట విక్రయించడానికి నానా తంటాలు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం తేమ 12 శాతం లోపు ఉంటే క్వింటాల్‌కు రూ.7550ల మద్దతు ధర చెల్లిస్తుంది. దీంతో గత నెలలో ఆయా కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించినప్పటికి పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామనే భరోసా రైతులకు అధికారుల నుంచి లభించక ఆందోళన చెందుతున్నారు. కేంద్రానికి కందులు తీసుకెళ్లాలా..? వద్దా అనే సందేహంతో జిల్లాల రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రైవేటులో విక్రయించా..



పండించిన మొత్తం కందిని ప్రభుత్వం కొనుగోలు చేస్తే బాగుంటుంది. నా సొంత పొలం 10 ఎకరాల్లో కంది పంటను సాగు చేశా. 70 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. 40 క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు అంటున్నారు. మిగిలిన పంటను బహిరంగ మార్కెట్‌లో అమ్మితే రూ.50 వేల వరకు నష్టపోయాను. ఎకరాకు రూ.3.31 మాత్రమే కొనుగోలు చేయాలనే నిబంధనను ప్రభుత్వం ఎత్తివేయాలి.
– మారుతి, రైతు, నాగిరెడ్డిపల్లి గ్రామం

అనుమతి రాలేదు

జిల్లాలో కంది అధిక దిగుబడి వచ్చిన రైతులు ప్రభుత్వం విధించిన ఎకరానికి 3.31 క్వింటాళ్ల నిబంధనతో ఇబ్బందులు పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీంతో పరిమితిని 6 క్వింటాళ్లకు పెంచాలనే అంశంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేలా లేఖ రాశాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే కొనుగోలు చేస్తాం.
– ఇంద్రసేనా, మార్క్‌ఫెడ్ డీఎం

నిబంధన ఎత్తేయాలని ఎమ్మెల్యేకు మొర

గత నెలలో నర్వలో కంది కొనుగోలు కేంద్రం ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో రైతులు ఎకరానికి 3.31 క్వింటాళ్ల నిబంధనను ఎత్తివేయాలని మొరపెట్టుకున్నారు. దీంతో ఎమ్మెల్యే మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి 6 క్వింటాళ్లకు పెంచేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా వివరాలిలా..	కొనుగోలు కేంద్రాలు : నారాయణపేట, దామరగిద్ద, మద్దూరు, మక్తల్, కోస్గి, నర్వ	కంది సాగు	దిగుబడి అంచనా	మద్దతు ధర
		70 వేల ఎకరాలు	2.65 లక్షల క్వింటాళ్లు	రూ.7550 (తేమ 12 శాతం లోపు ఉంటే)

సీఆర్పీలతోనే మహిళా సంఘాల బలోపేతం




జ్యోతి ప్రజ్వల చేస్తున్న సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్, కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామల్లో స్వయం సహాయక (మహిళా) సంఘాల బలోపేతం సీఆర్పీలతోనే సాధ్యమని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో 'సంఘాల బలోపేతంకు సీఆర్పీ వ్యూహం' కార్యక్రమాన్ని కలెక్టర్ విజయేందిరతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ మాట్లాడుతూ సీఆర్పీలు త్రిపుర, గోవా, ఇతర రాష్ట్రాల్లో మహిళలకు సంఘాల ఏర్పాటుపై శిక్షణ నిచ్చారన్నారు. సీఆర్పీలు ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లో మహిళా సంఘాల ఏర్పాటు, ప్రోత్సాహం, బలోపేతం కోసం 8 రోజుల ఆయా జిల్లాలోని గ్రామాలకు వెళ్లి అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామాల్లో మహిళలకు చాలా అంశాలపై అవగాహన లేక సంఘాలు ఏర్పాటు చేయడం లేదన్నారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ 'సంఘాల బలోపేతం–సీఆర్పీ వ్యూహం' కార్యక్రమం మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య, మండల, జిల్లా, రాష్ట్ర సమాఖ్యలు బాగా పనిచేసి ఆదర్శ రాష్ట్రంగా నిలవాలన్నారు. పలువురు సీఆర్పీలు, బుక్ కీపర్లు సంఘాల ఏర్పాటు, బుక్‌కీపింగ్‌తో పలు అంశాలపై అవగాహ న కల్పించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, సెర్ప్ ఐబీ డైరెక్టర్ నవీన్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, మహబూబ్‌నగర్, గద్వాల, వికారాబాద్, నారాయణపేట డీఆర్‌డీఓలు నర్సింహులు, నర్సింగరావు, శ్రీనివాస్, మొగులప్ప, అదనపు పీడీలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

ప్రమాద ఘంటికలు

శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల్లో అడుగంటిన జలాలు



శ్రీశైలం జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం ఇలా..

- పోటాపోటీగా తరలింపుతో వేసవికి ముందే భారీగా తగ్గిన నీటిమట్టం
- మరో నెలరోజుల్లోనే డెడ్ స్టోరేజీకి రెండు ప్రాజెక్టులు
- ఇప్పటికే యాసంగి పంటలకు వారబందీ పద్ధతిలో సాగునీరు
- అప్రమత్తం కాకపోతే తాగునీటికీ తిప్పలే

సాక్షి, నాగర్‌కర్నూల్: వేసవికి ముందే శ్రీశైలం, జూరాల జలాశయాల్లో నీటినిల్వలు భారీ స్థాయిలో అడుగంటుతున్నాయి. రానున్న రోజుల్లో మరింత వేగంగా నీటిమట్టం పడిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంకా వేసవి సమీపించక ముందే ఈ రెండు జలాశయాలు సగానికి ఖాళీ అయ్యాయి. శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 84.66 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. శ్రీశైలం డ్యాంలోని నీటిని వివిధ సాగునీటి ప్రాజెక్టులు, విద్యుదుత్పత్తి కోసం ఇరు రాష్ట్రాలు పోటాపోటీగా వినియోగించుకోవడంతో ప్రస్తుతం జలాశయం నీరు సగానికి మించి అడుగంటింది.

మేలుకోకుంటే ముప్పే..

ఈసారి కృష్ణానదికి భారీస్థాయిలో వరదలు రావడంతో శ్రీశైలం, జూరాల ప్రాజెక్టులు నీటితో కళకళలాడాయి. శ్రీశైలం నుంచి ఏపీ, తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులతో పాటు సుమారు 3 నెలల పాటు ఇరురాష్ట్రాలు విద్యుదుత్పత్తి కోసం నిరంతరం నీటిని వినియోగించాయి. ఏపీ కోసం హంద్రీనీవా సుజలా స్రవంతి, మల్యాల కేసీసీ, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడుహెడ్‌రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేయగా.. తెలంగాణలోని ఎంజీకేఎల్ఐకి నీటిని వినియోగించారు. వీటితో పాటు ఇరు రాష్ట్రాల జల విద్యుత్ కేంద్రాల్లో నిత్యం సుమారు 2 నుంచి 3 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. ఫలితంగా రెండు నెలల్లోనే జలాశయం నీటిమట్టం సగానికి మించి పడిపోయింది. మరో నెల రోజుల్లోనే డెడ్ స్టోరేజీ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ఇదే తీరు కొనసాగితే వేసవిలో తాగునీటి సరఫరాకు సైతం ఇబ్బందులు తలెత్తే ప్రమాదం లేకపోలేదు.

జూరాల పరిధిలో ఇలా..

పూర్తిస్థాయి నీటి సామర్థ్యం :	ప్రస్తుతం ఉన్న నీటినిల్వ :
9.657 టీఎంసీలు	5.287 టీఎంసీలు
వినియోగించుకునే అవకాశం ఉన్నది : 1.58 టీఎంసీల	

శ్రీశైలం పరిధిలో ఇలా..

పూర్తిస్థాయి నీటి సామర్థ్యం :	ప్రస్తుతం ఉన్న నీటినిల్వ :
215.807 టీఎంసీలు	84.66 టీఎంసీలు
వినియోగించుకునే అవకాశం ఉన్నది : 40.0 టీఎంసీలు	

తాగునీటికి ప్రణాళిక..

వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి కోసం ప్రణాళికను సిద్ధం చేశాం. శ్రీశైలం రిజర్వాయర్‌లో ఇకపై విద్యుదుత్పత్తి చేపట్టకుండా.. నీటిని నిల్వ ఉంచేందుకు ప్రభుత్వానికి లేఖ రాస్తాం. డ్యాంలో 40 టీఎంసీల నీటిమట్టం వరకు తాగునీటి వినియోగానికి వీలు ఉంటుంది.
– శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, నీటి పారుదల శాఖ

డెడ్ స్టోరేజీకి నీటినిల్వ..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో నీటినిల్వ రోజురోజుకూ తగ్గిపోతోంది. ప్రస్తుతం జలాశయంలో కేవలం 5.287 టీఎంసీల నీరు ఉండగా.. కేవలం 1.58 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ నీటితోనే ఆయకట్టు కింద యాసంగి పంటలకు వారబందీ పద్ధతిలో సాగునీరు అందించడంతోపాటు తాగునీరు అందించడం కష్టసాధ్యంగా మారింది.

4 టీఎంసీలపై ఆశలు..



జూరాల ప్రాజెక్టులో అడుగంటిన నీటిమట్టం

జూరాల డ్యాంలో నీరు భారీస్థాయిలో పడిపోవడంతో వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అప్రమత్తమైంది. కర్ణాటక రాష్ట్రంలోని నారాయణపూర్ జలాశయం నుంచి కనీసం ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని ఆ రాష్ట్రాన్ని ఇటీవల ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు ఇతర ఎమ్మెల్యేలతో కలిసి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విన్నవించారు. ఉమ్మడి జిల్లా తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని 4 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని కర్ణాటక ప్రభుత్వం నుంచి సంకేతాలు అందాయి. ఇప్పటికే జూరాల జలాశయంలోని నీరు కనిష్ట స్థాయికి చేరుకున్న నేపథ్యంలో నారాయణపూర్ నుంచి నీటి విడుదలపై ఆశలు నెలకొన్నాయి.

గిరిజనులను నాయకులుగా చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ విభాగం అధ్యక్షులు బెల్లయ్య నాయక్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఏఐసీసీ దేశవ్యాప్తంగా 25వేల మంది ఆదివాసీ గిరిజనులను నాయకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మొదటగా ఈనెల 12 నుంచి 14 వరకు కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం సోమశిలలో ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఇద్దరు ఆదివాసీ గిరిజన నాయకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. గిరిజనుల్లో రాజ్యాంగపరమైన హక్కులు, ఇవాళ అమలువుతున్న తీరు, లోపాలు, గిరిజన సంస్కృతిపై జరుగుతున్న దాడి తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పార్టీపరంగా ఒక యంత్రాంగం ఉండాలనే ఉద్దేశంతో మొదటగా ఉమ్మడి జిల్లాల వారీగా అనంతరం నియోజకవర్గం, మండలస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఈ రెండేళ్లలో 5 వేల మంది గిరిజనులను నాయకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణరావు పాల్గొంటారని, చివరిరోజు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. ఏఐసీసీ నాయకులు కొప్పుల రాజు, ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ శివాజీరావుమోగే ఈ మూడు రోజుల శిక్షణలో పాల్గొంటారని తెలిపారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో ఆదివాసీ విభాగం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి లింగంనాయక్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఆదివాసీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఏఐసీసీ ట్రైనర్ రాహుల్‌బాల్, ఉమ్మడి జిల్లా శిక్షణ ఇన్‌చార్జి కోట్యనాయక్, రాష్ట్ర కోఆర్డినేటర్ గణేష్‌నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచించారు. శుక్రవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని.. విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఆయన వెంట నాయకులు రహ్మతుల్లా, పరమేశ్, తులసీరాజ్, శ్రీను, గంగాధర్‌గౌడ్, నాగేశ్, సుదర్శన్‌శెట్టి, యాదగిరిశెట్టి, సాయిరాఘవ, గాలిపంపు శ్రీను, మణివర్ధన్‌రెడ్డి, రవీందర్, అబ్దుల్లా, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంతో తీరనున్న కష్టాలు

కొత్తపల్లి: మండలంలోని మన్నాపూర్ అల్లీపూర్ మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు శుక్రవాకం కొగండల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంతెన లేకపోవడంతో అల్లీపూర్ గామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా రూ.8కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారన్నారు. ఈ వంతెన నిర్మాణంతో ఇరు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. డీఈ విలోక్,ఏ ఈ అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, రమేష్‌రెడ్డి, నర్సిములు, లక్ష్మి నారాయణ రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చెన్నప్ప పాల్గొన్నారు.

గుడిసెల పోరు ఉధృతం



అమరచింతలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అమరచింత: పట్టణంలోని నిరుపేదలు ఇంటి స్థలాల హద్దులు చూపాలంటూ రెండున్నరేళ్లుగా గుడిసెలు వేసుకుని ఆందోళన చేస్తున్న పాలకులు పట్టించుకోకపోవడంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమయ్యారు. మండల కేంద్రంలోని బస్టాండ్ రహదారి పక్కన శనివారం నుంచి రిలేదీక్షలు చేపట్టి తమ ఆందోళన కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. సర్వేనంబర్ 567లోని దుంపాయికుంటలో గల 14 ఎకరాల పొలంలో ఇంటి స్థలాల కోసం కొనుగోలు చేసి 25 ఏళ్ల క్రితం అర్హులైన 400 నిరుపేదలకు ఇంటి పట్టాలను అందించారు. ఇంటి నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు వచ్చినా.. స్థలాలు చూపకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన ఇంటి స్థలాలకు స్వరాష్ట్రం సిద్ధించినప్పటికీ ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేకపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా తమకు ఇంటి స్థలాల విషయంలో డబుల్ ఇళ్ల అంటూ ఆశ చూపి నట్టేట ముంచిందని వాపోతున్నారు. దీంతో తమకు ఇంటి స్థలం చూపాలనే డిమాండ్‌తో సీపీఎం మద్దతులో 2022 సంవత్సరం నుంచి దుంపాయికుంటో గుడిసెలు వేసుకుని తమ పోరాటం కొనసాగిస్తున్నారు.

కొత్త ప్రభుత్వం కొలువుదీరినా..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా తమ సమస్య పరిష్కరించడం లేదని గుడిసెల పోరు బాధితులు రిలేదీక్షలకు సిద్ధమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి పలుమార్లు తమ గోడు విన్నవించినా.. ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజుల రిలే దీక్షలు



గుడిసెల పోరు లబ్ధిదారులకు న్యాయం జరగాలని కోరుతూ వారికి మద్దతుగా శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు రిలేదీక్షలు నిర్వహిస్తున్నాం. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి నిర్వహించి సమస్య పరిష్కారం అయ్యేవరకు కదలకుండా ఆందోళన కొనసాగిస్తున్నట్లు తెలిపారు.
– జీఎస్ గోపి, సీపీఎం మండల కార్యదర్శి

క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనులు గ్రామం చెరువులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చేపల వేటకు వెళ్లిన వ్యక్తులు నాగనూలు గ్రామ చెరువులో చెట్ల పొదల మధ్య కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మగ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సంఘటనకు సంబంధించి ఎస్సై గోవర్ధన్ వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వెలగొండలో మరో..

చిన్నంబావి: మండలంలోని వెలగొండ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెలగొండ గ్రామ శివారు పంట పొలాల్లోని కాల్వలో వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. కాగా.. మృతుడి ఒంటిపై తెల్లరంగు టీషర్టు, బ్లూ కలర్ షార్ట్ ఉందని, వ్యక్తి నలుపు కలర్‌లో ఉన్నాడన్నారు. ఎవరైనా గుర్తిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తకోట రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన కొత్తింటి చంద్రమోహన్, లక్ష్మమ్మ దంపతులు మరో ఇద్దరితో కలిసి ఈ నెల 2న కారులో జోగులాంబదేవి దర్శనానికి వెళ్లి తిరిగి హైదరాబాద్ బయలుదేరారు. ఈ క్రమంలో కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లి స్టేజీ సమీపంలో జాతీయ రహదారి-44పై కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న లక్ష్మమ్మకు తీవ్ర గాయాలు కాగా 108లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈ ఘటనపై లక్ష్మమ్మ భర్త చంద్రమోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం



రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును నిరసిస్తూ గ్రామస్తులు 15 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం 16వ రోజు పెద్ద ధన్వాడలో కొనసాగుతున్న దీక్ష శిబిరాన్ని వారు సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఫ్యాక్టరీ ఏర్పాటుతో వాతావరణం, నీరు కలుషితమవుతుందని.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాలని చూస్తే సహించేది లేదని తెలిపారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, న్యాయం జరిగే వరకు పోరాడుదామన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు, ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్, ఏబీవీపీ పీయూ మాజీ వైస్ ప్రెసిడెంట్ తిరుపతి, ఎల్లప్ప, పవన్ పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రికి దిక్కెవరు..?



సీటీ స్కాన్ మిషన్

పేదలకు అందని మెరుగైన వైద్యం

- పనిచేయని సీటీ స్కాన్ మిషన్
- బయటకు రెఫర్ చేస్తున్న వైద్యులు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- రెండు వారాల నుంచి ఇదే పరిస్థితి
- అందుబాటులో లేని మందులు

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేస్తున్నా ఫలితం మాత్రం లేకుండా పోతోంది. సర్కారు దవఖానాలు (జనరల్ ఆస్పత్రులు) సమస్యలతో సతమతమవుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొన్ని రోజుల నుంచి సమస్యలు తాండవం చేస్తున్నాయి. స్థానికంగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేక ఇక్కడివచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



సీటీ స్కాన్ పని చేయడం లేదని డోర్‌పై అతికించిన స్టిక్కర్

ఉమ్మడి జిల్లాలో చాలావరకు వైద్యంకోసం ఇక్కడికే వస్తుంటారు. కానీ వారికి సరైన వైద్యసేవలు అందక అవస్థలు పడుతున్నారు.

రూ.26లక్షల వరకు ఖర్చు

ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో ఉన్న సీటీ స్కాన్ మరమ్మతులు చేయించాలంటే దాదాపు రూ.26లక్షల వరకు ఖర్చు అవుతుంది. భారీగా ఖర్చు ఉండటంతో ఆస్పత్రిలో ఈస్థాయిలో నిధులు లేవు. ఈ విషయంపై మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఉన్నతస్థాయి అధికారులకు విన్నవించినా బాగు చేయడానికి నిధులు ఏర్పాటు చేయడం లేదు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండు వారాల నుంచి ఎస్‌వీఎస్‌తో టై అప్ అక్కడి పంపిస్తున్నాం. సీటీ స్కానింగ్‌కు వైట్ రేషన్ కార్డు ఉంటే రూ.500లు లేకపోతే రూ.1000 తీసుకుంటున్నారు. ఎంఆర్‌ఐకి రూ.2500 తీసుకుంటున్నారు.

– డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, సూపరింటెండెంట్

బయటకు రెఫర్

రోడ్డు ప్రమాదంలో గాయపడి సీరియస్‌గా ఉన్న ప్రతి క్షతగాత్రుడితో పాటు జబ్బు తీవ్రత తెలుసుకోవడానికి సైతం సీటీ స్కానింగ్ తప్పనిసరి. అలాంటి సీటీ స్కాన్ రెండు వారాల నుంచి పనిచేయడం లేదు. దీంతో నిత్యం పదుల సంఖ్యలో సీటీ స్కాన్ అవసరమైన రోగులకు బయటకు రెఫర్ చేస్తున్నారు. దీంతో ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో రూ.2వేల నుంచి రూ.3వేల వరకు వెచ్చించి స్కానింగ్ చేసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి వచ్చిన క్షతగాత్రులను బయటకు తీసుకెళ్లి స్కానింగ్ చేయించుకు రావడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని రోగితో ఉండే వారు పలువురు వాపోతున్నారు.

సమయపాలన పాటించని వైద్యులు

కొన్ని రోజుల నుంచి జనరల్ ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు మిషన్లు సరిగా పనిచేయడం లేదంటూ సీటీ స్కానింగ్, పలు రకాల పరీక్షలను బయటకు రాసి ఇస్తున్నారు. ఎక్స్‌రే మిషన్ సైతం మొరాయిస్తుంది. కేవలం ఓపీ సమయంలో వైద్యులు పరీక్షించి మందులు రాసి చేతులు దులుపుకుంటున్నారు. వైద్యులు రాసే మందులలో ఆరు రకాలు రాస్తే దాంట్లో నాలుగు రకాలు అందుబాటులో ఉండటం లేదు. ఆస్పత్రిలోని ల్యాబ్‌లో చేసే అన్ని రకాల రక్త పరీక్షలకు సంబంధించి.. పరీక్ష చేసిన తర్వాత ఇచ్చే రిపోర్ట్స్ సైతం అక్యూరేట్‌గా రావడం లేదని విమర్శలున్నాయి. జనరల్ ఆస్పత్రిలో చేసిన టెస్టుల రిపోర్ట్స్ ఒక మాదిరిగా బయట ల్యాబ్‌లలో చేసిన రిపోర్ట్స్ ఇంకో మాదిరిగా వస్తున్నాయని రోగులు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మృతుల్లో ఓ చిన్నారి.. ఓ మహిళ
- నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన కారు

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా పెద్ద మందడి మండలం వెల్టూర్ స్టేజీ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి, ఓ మహిళ మృతిచెందినట్లు పెద్దమందడి ఎస్‌ఐ యుగంధర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన చిన్నబాబు తన కుటుంబంతో కలిసి కర్నూలులో జరిగే బంధువుల గృహ ప్రవేశానికి ఉదయం కారులో బయలుదేరారు. 9 గంటల ప్రాంతంలో పెద్దమందడి మండలం వెల్టూర్ స్టేజీ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకు వేయడంతో వెనుక నుంచి కారు ఢీకొంది. అదే సమయంలో వెనక వచ్చిన ట్రక్కు కారును బలంగా ఢీకొనడంతో రెండింటి మధ్యలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న సాఫియాన్ (10) అక్కడికక్కడే మృతిచెందగా.. హజరాంబి (45), చిన్నబాబు, మౌలాలి, సిద్దంబీ, జాహ్నవికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హజరాంబి మృతిచెందారు. కారులో ఇరుకున్న వారిని బయటకు తీసేందుకు స్థానికులు, హైవే సిబ్బంది ఎంతో శ్రమించారు. రోడ్డు మధ్యలో ప్రమాదం చోటు చేసుకోవడంతో గంటకు పైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, హైవే సిబ్బంది ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ సాయంతో పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.



హజరాంబి (ఫైల్)



సాఫియాన్ (ఫైల్)

ప్రేమ పెళ్లికి నిరాకరించారని..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రేమ పెళ్లికి నిరాకరించారని మనస్తాపంతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలపరిధిలోని పెద్దాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం గ్రామానికి చెందిన యాదగిరి (23) ఓ యువతిని ప్రేమించాడు. యువతి కుటుంబ సభ్యులు ప్రేమ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతుడి అన్న సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నమో వేంకటేశా..



స్వామివారికి తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న భక్తులు

- అట్టహాసంగా మన్యంకొండ బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- కోటకదిర నుంచి గుట్టపైకి స్వామివారి సేవ



స్వామివారి ఉత్సవ విగ్రహాలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం దేవస్థానం సమీపంలోని కోటకదిర గ్రామంలోని ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్ ఇంటి నుంచి స్వామివారిని ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్యంకొండ గుట్టపైకి పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. సన్నాయి, బ్యాండ్ వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామస్మరణ మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. గ్రామ పురవీధుల గుండా స్వామివారిని పల్లకీలో భారీఎత్తున ఊరేగించారు. అడుగడుగునా భక్తుల కోలాటాలు, భజనలు చేశారు. దీంతో కోటకదిర గ్రామం భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. కాగడాల వెలుతురులో స్వామివారు ధగధగ మెరిసిపోతూ పల్లకీలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. స్వామివారిని కోటకదిర నుంచి ఘాట్ రోడ్డు గుండా దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు.

స్వర్ణాలంకరణలో దర్శనం..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం తెల్లవారుజామున ముందుగా స్వామివారిని వివిధ బంగారు ఆభరణాలతో అలంకరించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం, నివేదన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో దేవస్థానంలోని గర్భగుడిలో స్వామివారు స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హారతి దీపాల వెలుతురులో కనిపించిన స్వామివారి దృశ్యాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మన్యంకొండకు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా తిరుచ్చీసేవ..

బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి దేవస్థానంలో స్వామివారి తిరుచ్చీసేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వారం రోజుల పాటు దేవస్థానంలో ప్రతిరోజు రాత్రి పలు సేవా కార్యక్రమాలు జరిపిస్తారు. ఇందులో భాగంగానే మొదటిరోజు తిరుచ్చీసేవ ఏర్పాటు చేశారు. వెండి పల్లకీలో స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు చేసి మళ్లీ స్వామివారిని గర్భగుడి వద్దకు తీసుకెళ్లారు. తిరుచ్చీసేవలో స్వామివారు బంగారు ఆభరణాలు, వివిధ పూల అలంకరణలో ధగధగ మెరిసిపోతూ దేవస్థానం ఆవరణలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు హంసవాహన సేవ..

మన్యంకొండ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన శనివారం రాత్రి స్వామివారికి హంసవాహన సేవ నిర్వహించనున్నారు. ముందుగా స్వామివారిని హంస వాహనంలో ఊరేగించి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్ష

వనపర్తి: రోడ్డు ప్రమాదం కేసులో ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి శ్రీలత తీర్పు నిచ్చినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వివరాలు.. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లికి చెందిన చంద్రారెడ్డి అక్టోబర్ 19, 2015లో కరెంట్ మోటార్ మరమ్మతు చేయించడానికి వనపర్తికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తూ.. రాజీవ్‌చౌక్‌లో గల ఓహోటల్‌లో టిఫిన్ చేసేందుకు రోడ్డు దాటుతున్నాడు. గోపాల్‌పేట వైపు నుంచి వస్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి చంద్రారెడ్డిని ఢీకొన్న అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి కుమారుడు అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు డ్రైవర్ రఫీపై అప్పటి పట్టణ ఎస్‌ఐ గాంధీనాయక్ కేసు నమోదుచేశారు. ప్రస్తుత ఎస్‌ఐ హరిప్రసాద్ ఆదేశానుసారం కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ రాజశేఖర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) సునీతదేవి కోర్టులో వాదనలు వినిపించారు. రఫీపై నేరం రుజువు కావడంతో ఫస్ట్ అడిషనల్ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి శ్రీలత తీర్పు ఇచ్చినట్లు డీఎస్పీ తెలిపారు.

జోరుగా కోళ్ల పందేలు



కోళ్ల పందేలు ఆడుతున్న పందెం రాయుళ్లు

తెలకపల్లి: దేవుని పేరుతో జూదం ఆడుతూ లక్షల్లో దండుకుంటున్నారు. జాతరలో కోళ్ల పందేలు, నక్కిదువ్వ లాంటి జూదాలు ఆడుతున్నారు. మండలంలోని పెద్దపల్లి గ్రామంలో శ్రీబుగ్గవేంటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర జరుగుతుంది. అయితే స్వామివారి జాతర సందర్భంగా ప్రతి సంవత్సరం కోళ్ల పందేలు ఆడుతుంటారు. గత రెండు రోజుల నుంచి పెద్దపల్లి వేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా కోళ్ల పందేలు ఇతర జూదాలు ఆడుతున్నారు. రెండు రోజుల నుంచి ఈ ప్రాంతంతోపాటు ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్దపల్లికి చేరుకుని కోళ్ల పందేల పోటీలు జోరుగా సాగుతున్నాయి. పెద్దపల్లిలో టెంట్లు ఏర్పాటు చేసుకుని దర్జాగా కోళ్ల పందేలు నిర్వహిస్తూ.. రూ.లక్షల్లో చేతులు మారుతున్నట్లు సమాచారం. పలువురి అరెస్టు కోళ్ల పందేలు ఆడుతున్న కొందరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. పెద్దపల్లిలో బుగ్గవేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా ఆలయ సమీపంలో పెద్దపల్లి గ్రామానికి చెందిన కొందరు కోళ్ల పందేలు ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకుని కోళ్ల పందేల రాయుళ్లు బాలస్వామి, కస్తాల భాస్కర్, సాకలి సలేశ్వరం, రామకృష్ణ తదితరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. వారి నుంచి 2 పందెం కోళ్లు, రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కబడ్డీలో వనపర్తికి మూడో స్థానం



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో ఈ నెల 4న నుంచి జరుగుతున్న 71వ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ పోటీల్లో వనపర్తి జిల్లా జట్టు మూడోస్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో సూర్యాపేట చాంపియన్‌గా నిలవగా, నల్లగొండ రన్నర్‌గా నిలిచింది. ఇంటర్నేషనల్ కబడ్డీ ఫెడరేషన్ డైరెక్టర్ జగదీశ్వర్ యాదవ్ బహుమతి ప్రదానం చేశారు.

ట్రాన్స్‌జెండర్‌తో ప్రేమ..

అనుమానాస్పదంగా యువకుడు మృతి

- శరీర సున్నిత భాగాల్లో తీవ్ర గాయాలు
- చిత్రహింసలు గురిచేశారని మృతుడి తల్లి అనుమానం
- ఇద్దరిపై కేసు నమోదు



మృతి చెందిన నవీన్ (ఫైల్)

గద్వాల క్రైం: ట్రాన్స్‌జెండర్‌తో ప్రేమ వ్యవహారం చివరికి ప్రాణాల మీదకు తెచ్చింది. ట్రాన్స్‌జెండర్‌ను ప్రేమించి చివరకు పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన గద్వాల జిల్లా కేంద్రంలో జరిగింది. మృతుడి తల్లి శంకుతుల, పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... గద్వాల పట్టణంలోని చింతలపేటకాలనీకి చెందిన బోయ నవీన్(25) అనే యువకుడు, ట్రాన్స్‌జెండర్(రవి అలియాస్ పల్లవి) ఇద్దరు స్నేహితులు. కాగా వారిద్దరు ఇటీవలే ప్రేమలో పడ్డారు. వారి ప్రేమకు గుర్తుగా నవీన్ తన చెస్ట్ (ఎడమ వైపు) ట్రాన్స్‌జెండర్ పల్లవి(రవి) టాటును సైతం వేయించుకున్నాడు. ఇంతలో ఏం జరిగిందో కానీ మంగళవారం సాయంత్రం పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో గద్వాల జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు సిఫార్సు చేశారు. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రెండు రోజులుగా అందించినా పరిస్థితి మెరుగు పడకపోలేదు. చేసేదేమీ లేక గురువారం రాత్రి తిరిగి గద్వాల ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా.. ఇక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా ఈ విషయం ప్రస్తుతం గద్వాల జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే మృతుడి రెండు కాళ్లు, తొడలు, సున్నితమైన ప్రదేశాల్లో గాయాలు ఉన్నాయి. గాయాలను పరిశీలిస్తే వేడి చేసిన వస్తువుతో వాతలు పెట్టినట్లు ఎర్రగా కందిపోయి ఉన్నాయి. దీంతో మృతుడి తల్లి తన కుమారుడు పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోలేదని, చిత్రహింసలు పెట్టారని అనుమానం వ్యక్తం చేసింది. ఈమేరకు ట్రాన్స్‌జెండర్ పల్లవి అలియాస్ రవి, నరేష్‌పై ఆమె ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు.



మృతుడి ఎడమ వైపు ట్రాన్స్‌జెండర్ టాటు కలిగిన దృశ్యం

పక్కా వ్యూహ రచనతోనే?

ట్రాన్స్‌జెండర్ (పల్లవి) రవి, నవీన్‌లు ఇద్దరూ గతంలో చింతలపేటకాలనీలోనే ఉండేవారు. కొన్నేళ్ల క్రితం రవి కాలనీ వదిలి వెళ్లిపోయి ట్రాన్స్‌జెండర్‌గా మారి పట్టణ శివారులో హమాలీ కాలనీలో సొంత ఇళ్లు కట్టుకున్నాడు. నవీన్ జిల్లాకేంద్రంలోని ఓ ఫైనాన్సియర్ వద్ద కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతడి తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా కుటుంబ భారాన్ని మోస్తున్నాడు. ఈ క్రమంలో పల్లవితో నవీన్ ప్రేమలో పడ్డాడు. ఈ నేపథ్యంలో పల్లవిని డబ్బులు యాచించేందుకు బయటికి వెళ్లొద్దని చెప్పినట్లు తెలుస్తోంది. ఈ విషయంలోనే ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చినట్లు సమాచారం. ఈనెల 4న అర్ధరాత్రి వేళ నవీన్‌ను పల్లవి (రవి) తమ్ముడు నరేష్ ఇంటి వద్దకు వచ్చి స్కూటీపై ఎక్కించుకు వెళ్లిన వీడియో సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఈ వీడియోలు సైతం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో పక్కా వ్యూహరచనతోనే నవీన్‌ను చిత్రహింసలకు గురి చేసి హత్యచేసి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరువురి మధ్య సంబంధాలపై ఆరా..

నవీన్ మృతిపై అతడి తల్లి శకుంతల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశాం. ఇరువురి మధ్య ఉన్న సంబంధాలపై ఆరా తీస్తాం. ట్రాన్స్‌జెండర్ పల్లవిపై గతంలో ఏమైనా కేసులు ఉన్నాయా అన్న కోణంలో విచారిస్తాం. ఈ నెల 4న జరిగిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుటాం.

– కళ్యాణ్‌కుమార్, పట్టణ ఎస్‌ఐ, గద్వాల